www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 జనవరి 2024
5
చిత్తూరు



అలుపెరగని పోరాటం..

- రెండోరోజుకు అంగన్‌వాడీల నిరవధిక దీక్షలు
- జిల్లా వ్యాప్తంగా ఎస్మా జీవో కాపీల దగ్ధం



కలెక్టరేట్ ఎదుట రెండో రోజు దీక్షల్లో అంగన్వాడీలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్ వాడీలు అలుపెరగని పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నుండి అంగన్‌వాడీల ప్రధాన డిమాండ్లపై ఎలాంటి స్పందన లేకపోవడంతో కలెక్టరేట్ ఎదుట వారు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. వారు ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా జిల్లా కేంద్రం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం అంగన్‌వాడీలు ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేశారు. వికోట, శాంతిపురం, కుప్పం, కార్వేటినగరం, నగరి ఇతర ప్రాంతాల్లో అంగన్‌వాడీలు ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేసి ప్రభుత్వ తీరును నిరశిస్తూ నినాదాలు చేశారు. అంగన్‌వాడీల సేవలు అత్యవసర సేవలు కాకపోయినా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సమ్మెను నీరుగార్చేలా ఎస్మా చట్టం జీవో 2ను తీసుకురావడం దుర్మార్గమని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.

అంగన్‌వాడీల పోరాటాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తీసుకొచ్చినా అంగన్‌వాడీలు జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తున్నారని ప్రధాన సమస్యలైన జీతాల పెంపు, గ్రాట్యూటీ అమలుపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకిల, గౌరవాధ్యక్షులు వాడ గంగారాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, ఎఐటియుసి నాయకులు నాగరాజు, రమాదేవిలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట రెండో రోజు దీక్షలను ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం దుర్మార్గంగా ప్రయోగించిన ఎస్మా జీవో 2 కాపీలను దగ్ధం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా అంగన్వాడీల ఉద్యమంపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ఆగ మేఘాల మీద జీవో నెంబర్ 2 తీసుకువచ్చి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయోగిస్తుండడం తగదన్నారు. ఇలాంటి బెదిరింపులను అంగన్వాడీల ఉద్యమం చాలా చూసిందని ఎస్మా లాంటివి ఎన్ని చట్టాలు తెచ్చినా ఉద్యమం ఆగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా



జీవో కాపీలను దగ్ధం చేస్తున్న సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నేతలు

ప్రయోగాలు చేయడం మానేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ షకీలా, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, సిఐటియు జిల్లా కార్యదర్శి కే సురేంద్రన్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు నాగరాజు, రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఖరి నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంగనవాడీలతో పాటు మున్సిపాలిటీ , ఎస్-ఎస్‌ఏ కార్మికులందరూ సమ్మె బాట పట్టారని, ఎన్నికలు సమీపిస్తున్నా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని ప్రభుత్వాన్ని ఇంటికి పంపించే రోజులు దగ్గరలోనే వున్నాయని హెచ్చరించారు. నాయకురాలు ప్రభావతి, సృజని, మమతలతో పాటు బంగారుపాళ్యం, ఐరాల, యాదమరి అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు రెండో రోజు దీక్షల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మండలంలో ఐసిడిఎస్ ఆఫీసు ఎదుట ఆదివారం



వికోటలో ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు

నిర్వహించిన సమావేశానికి సిఐటియు నాయకులు గిరిధర గుప్తా అధ్యక్షత వహించారు. పలమనేరు ఐసిడిఎస్ ఆఫీసు ఎదుట 27 వ రోజు ఆదివారంఎస్మా కాపీలను అంగన్‌వాడీలు దగ్ధం చేశారు. అంగన్ వాడీల శాంతియుత ఆందోళనను, సమ్మెను అణిచివేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించటాన్ని సిఐటియుతో పాటు పలు కార్మిక సంఘాలు ఖండిస్తున్నాయని, ఎస్మా ప్రయోగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఐఎఫ్టి రాష్ట్ర నాయకురాలు బిఆర్ జ్యోతి శాంతి, సీఐటీయూ నాయకులు భారతి, సమర శిల సరస్వతి పేర్కొన్నారు.



పలమనేరులో



ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ అందుకుంటున్న పుష్పలత

పేదరికం కాదేదీ చదువుకు అనర్హం

పేదింటి అమ్మాయికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - పలమనేరు: చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించింది ఓ పేదింటి అమ్మాయి.. అందుకే అమ్మాయికి గోల్డ్ మెడల్ వరించింది. పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం దండపల్లి గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన కొండయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె సి. పుష్పలత ఎంటెక్ లో టాపర్ గా నిలిచింది. ఈ నెల ఆరవ తేదీ శనివారం అనంతపురం జెఎన్‌టియు లో జరిగిన గోల్డ్ మెడల్ 13వ వార్షికోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బాష చేతుల మీదుగా పుష్పలతకు ప్రొఫెసర్ పి.ఎన్. ఆమోదరం ఎండోమెంట్ మెమోరియల్ అవార్డు అందించారు. పుష్పలత తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె దండపల్లి హై స్కూల్ నుండి కూడా టాపర్‌గా నిలిచిందని, దాన్ని గుర్తించిన శ్రీ సాయి చైతన్య కళాశాల యాజమాన్యం ఫ్రీ ఎడ్యుకేషన్ అందించారని అక్కడ కూడా 86 శాతం మార్కులు సాధించిందని, తర్వాత చిత్తూరు పట్టణం సమీపంలో సీతమ్స్ కాలేజీలో బీటెక్‌లో 85 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచిందని, ఎంటెక్‌లో స్ట్రక్చర్ ఇంజినీరింగ్ లో టాపర్‌గా నిలిచిందని తెలిపారు. చిన్నతనం నుండి పుష్పలత చదువులో ముందంజలో రాణించిందని, అటువంటి ఉత్సాహం కలిగిన తమ కుమార్తెను కూలి పనులు చేసి చదివించామని ఫలితంగానే పుష్పలతకు గోల్డ్ మెడల్ వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ పుష్పలత చదువులో మంచి మెరిట్ సాధించినందుకు గ్రామానికి మంచి పేరుతో పాటు తమకు చాలా ఆనందంగా ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. పలువురి విద్యార్థులకు పుష్పలత స్ఫూర్తిగా నిలిచింది.

16న శ్రీవారి పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పార్వేట ఉత్సవం జనవరి 16వ తేదీ ఘనంగా జరగనుంది. అదేరోజున గోదాపరిణయోత్సవం నిర్వహిస్తారు. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయర్ మఠం నుండి ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువెళ్ళి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు మలయప్పస్వామివారు, కృష్ణస్వామివారు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పారువేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామివారు ఆలయానికి చేరుకుంటారు.

ఆర్జితసేవలు రద్దు : ఈఉత్సవాల కారణంగా జనవరి 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.



ఎస్ఎస్ఏ ఉద్యోగుల పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తున్న యుటిఎఫ్ నాయకులు

19వ రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షలు

పలు కార్మిక సంఘాల మద్దతు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోసం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 19వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు నినాదాలు చేస్తూ దీక్షల్లో పాల్గొన్నారు. వీరి పోరాటానికి సిఐటియు నాయకులు వాడ గంగాజు, సురేంద్రన్ సంఘీభావం ప్రకటించారు. యూటిఎఫ్ నాయకులు జివి రమణ, కత్తిశేఖర్‌లు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యల పట్ల వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పోరాటాలను అణచివేసే ప్రయత్నం చేయడం తప్ప సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచించడం లేదన్నారు. ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదని రెట్టించిన ఉత్సహంతో సమ్మెలు కొనసాగుతాయన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే ఎస్మా ప్రయోగించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెడికల్ రెప్స్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ఎపి మెడికల్ అండ్ సెల్స్ రెప్రజెంటేటీవ్ యూనియ న్ మొదటి సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక సిఐటియు కార్యా లయంలో నిర్వహించారు. ఈ సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల మార్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. యజమాన్యాలు డిజిట్ విధానం తీసుకొచ్చి పని భారాన్ని పెంచాయని, సెల్ రెప్రజెంటేటీవ్స్‌పై దాడులు చేస్తున్నారన్నారు. యాజమాన్య దాడులను నిరసిస్తూ ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. పని భారాన్ని తగ్గించాలన్నారు. ఈ సమావేశంలో ఎపి మెడికల్ అండ్ సెల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఢిల్లీ గణేష్, కార్యదర్శి జవహర్, ఉపాధ్యక్షులు విష్ణు, పార్థసారధి నాయుడు, సంయుక్త కార్యదర్శులు విజయకుమార్, హేమగిరి, కోశాధికారిగా సాంభశివరెడ్డి లతో పాటు తొమ్మిది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు పాల్గొన్నారు.



మెడికల్ రెప్స్ యూనియన్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రత్యామ్నాయం సరే..కార్మికుల కష్టాలు పట్టవా?

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 'మేము సైతం..' అంటూ పారిశుధ్య పనులు చేస్తున్న ఎన్జీవోలు, కాలనీ సంఘాల వారు ఒకటి రెండు రోజులు ప్రత్యామ్నాయంగా పారిశుధ్య పనులు చేస్తున్నారు.. కుళ్లి కంపుకొడుతున్న చెత్తను తొలగిం చడంతో పాటు రోడ్లను ఊడ్చి శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చర్చలు జరిపినా ప్రధాన డిమాండ్ల విషయం తేల్చడం లేదు. ఫలితంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు.

పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో ఉన్నారంటూ ప్రభుత్వం, నగర కమిషనర్ పిలుపుతో పారిశుధ్య పనులు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంఘాలకు పారిశుధ్య కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల కష్టాలు తెలియనివి కాదు.. ఉదయాన్నే వాకింగ్‌కు వెళుతున్న సమయంలో మన కళ్లముందే వారు పడే కష్టం కనిపిస్తోంది. రోజంతా పని చేస్తే వారికి ఇచ్చే జీతం ఏ పాటిదో అర్థం అవుతుంది. జీవితం అంతా ఇదే వృత్తిలో ఉంటున్న వారు అనేక ఆరోగ్య సమస్యలెదుర్కొంటున్నారు. చాలీ చాలని జీతాలు నెలంతా పని చేస్తే ఇచ్చేది రూ. 18 వేలు, ఉద్యోగ భద్రత లేదు.. కార్మిక చట్టం ప్రకారం యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనె ఇచ్చే పరిస్థితి లేదు.

వీరి సేవలకు వెలకట్టగలమా...?

కరోనా కష్టపరిస్థితుల్లో సేవలందించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది పారిశుధ్య కార్మికులు కరోనా సోకి మృతి చెందారు. వీరి కుటుంబాలు వీధిన పడ్డాయి. అయినా బతుకు తెరువు కోసం అనేక మంది పారిశుధ్య కార్మికులుగా మనకు సేవలు అందిస్తున్నారు. వీరి సేవలకు వెలకట్ట గలమా? స్వయంగా ప్రభుత్వ, ప్రజా ప్రతినిధులే పారిశుధ్య కార్మికుల సేవలకు వెలకట్టలేమని స్వయంగా అనేక సార్లు ప్రకటించారు. 'జీతం సరిపోవడం లేదు' అంటూ సమ్మె చేపడితే కార్మికులను దోషులుగా చూపుతూ పోటీ కార్మికులను పనిలోకి దింపడం, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంఘాలచే పారిశుధ్య పనులు చేయిస్తోంది. ఇది ఎంత వరకు సబబు? అని ట్రేడ్ యూనియన్ నేతలు, పారిశుధ్య కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

అణచివేసే ప్రయత్నాలు మానుకోవాలి

ఇచ్చి హామీ మేరకు పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాల అమలు, ఇతర చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతన్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని నేటి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఐదేళ్ళపాటు వేచి చూశాం. 15 ఏండ్లు, 12 ఏండ్లుగా పని చేస్తున్న కార్మికులు కాంట్రక్టు పద్ధతిలోనే చాలీ చాలని జీతాలతో నెట్టుకొస్తు న్నారు. జగన్ ఇచ్చిన హామీ మేరకు పర్మినెంట్ చేయాలని కోరుతున్నాం.



పలమనేరులో

- వాసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

బెదిరింపులు మానుకోండి..

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు అన్ని యూనియన్లు ఏకతాటిపై సమ్మెకు పిలుపు నిచ్చాయి. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించక పోగా బెదిరింపులకు పాల్పడుతోంది.



పారిశుధ్య పనులు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంఘాలు

రాష్ట్రంలో ఎప్పుడు లేని విధంగా జగన్ ప్రభుత్వం ఎస్మా చట్టం జీవో -2 తీసుకొచ్చి కార్మికులను ఆందోళ నకు గురిచేస్తోంది. సమస్యలపై చర్చిస్తున్న ప్రభుత్వ పెద్దలు స్పష్టమైన హామీలు ఇవ్వడం లేదు. ప్రధాన డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పడం లేదు. ఫలితంగా సమ్మెలు కొన సాగుతున్నాయి.

- వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

పలమనేరులో: పలమనేరులో కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు పలు కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ కార్మిక సంఘం కార్యదర్శి మద్దెల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు శ్రీనివాసులు, జాన్ ఆనంద్, రమేష్ బాబు, ఎం బాలాజీ, వై బాబు, బి వెంకటేష్ , ఆర్ వాసు, సురేష్, ఎం ఆనంద్, అంజి కార్మికులు పాల్గొన్నారు.



నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కార్మిక యూనియన్ నాయకులతో చర్చలు

నగర పరిధిలోని ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులు తమ విధులకు హాజరుకావాలని నగరపాలక కమిషనర్ డాక్టరు జె అరుణ కోరారు. ఆదివారం మధ్యాహ్నం నగర పాలక కార్యాలయంలో మున్సిపల్ అవుట్సోర్సింగ్ ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం కార్మికుల యూనియన్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. మున్సిపల్ ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య లోపం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరుకావాలని కోరారు. కమిషనర్ పిలుపుతో కార్మిక సంఘాల నాయకులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, సానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య, మున్సిపల్ అవుట్సోర్సింగ్ ప్రజారోగ్య, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



యూనియన్ నేతలతో చర్చిస్తున్న కమిషనర్

టెన్నిస్‌లో ఉద్దండు

- ప్రపంచ స్థాయిలో ప్రతిభ చాటుతున్న అన్నదాత బిడ్డ
- వరుస విజయాలతో టెన్నిస్‌లో రాణిస్తున్న గూడూరు క్రీడాకారిణి
- అండర్-18 విభాగంలో దేశంలో 4వ స్థానం, ప్రపంచంలో 385ర్యాంక్
- ఉత్తమ ఆటతీరుతో ఆదర్శంగా నిలుస్తున్న క్రీడాకారిణి దండు లక్ష్మీసిరి

ప్రజాశక్తి-గూడూరుటౌన్ (తిరుపతి జిల్లా)

తాను బ్యాట్ పట్టిందంటే విజయం సాగిలపడాల్సిందే.. టోర్నీలో తాను బరిలోకి దిగుతోదంటే ప్రత్యర్థులకు వణుకుపుట్టాల్సిందే.. టెన్నిస్ పోటీల్లో 8ఏళ్లుగా వరుస విజయాలతో జోనల్ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి ర్యాంకు వరకూ తన ప్రస్థానంలో ఎక్కడా ఆగిపోలేదు. ఓ సాధారణ అన్నదాత కుటుంబంలో మెరిసిన టెన్నిస్ క్రీడాకారిణి దండు లక్ష్మీసిరి ప్రతిభ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

కుటుంబ నేపథ్యం..

గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతానికి చెందిన దండు మహేష్‌రెడ్డి, స్రవంతి దంపతులకు లక్ష్మీ సిరి జన్మించింది. సాధారణ పరిస్థితుల నుంచే తన విద్యను కొనసాగిస్తోంది. అమ్మనాన్నల ప్రోత్సాహంతో టెన్నిస్ క్రీడలో ప్రపంచ స్థాయిలో రాణిస్తోంది.

నాన్న ప్రేరణతోనే క్రీడలోకి..

తన తండ్రికి బ్యాడ్మింటన్ అంటే చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. తన తండ్రితో పాటు చిన్ననాటి నుంచి బ్యాడ్మింటన్ ఆడటానికి వెళ్లే క్రమంలో లక్ష్మీ సిరి టెన్నిస్‌పై ఆసక్తి పెంచుకుంది. అమ్మనాన్నలు ప్రోత్సహించడంతో టెన్నిస్‌పై నైపుణ్యాన్ని క్రమంగా పెంచుకుంది. వివిద చోట్ల నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొంటూ వరుస విజయాలు సాధించింది. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ప్రస్తుతం ప్రపంచ స్థాయి ర్యాంకును కైవసం చేసుకుంది.

దేశంలో 4వ ర్యాంక్ కైవసం..

తన ఉత్తమ క్రీడా ప్రతిభతో లక్ష్మీసిరి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. చిన్ననాటి నుంచి పెంచుకున్న నైపుణ్యంతో తన అనుభవాన్ని ఆటలో ప్రదర్శిస్తూ వరుస విజయాలు సాధిస్తోంది. 8ఏళ్ల తన ప్రస్తానంలో అండర్-18టెన్నిస్ పోటీల్లో దేశంలో 4వ ర్యాంకును, ప్రపంచంలో 385వ ర్యాంకును కైవసం చేసుకొని తన ప్రస్తానాన్ని మరింత మెరుగైన ప్రదర్శనతో ముందుకు సాగుతోంది.

కొనసాగుతున్న ప్రస్థానం..

ఇటీవల ప్రపంచ స్థాయి టోర్నమెంట్లో అద్భుతమైన ప్రదర్శన కనపరిచి ప్రస్తుతం ఫైనల్స్‌కు చేరుకుంది. ఇటివల జరిగిన ఢిల్లీ , గౌహతి ప్రాంతాల్లో జరిగిన ప్రపంచ స్థాయి టోర్నమెంట్‌లో ఫైనల్స్‌లో ప్రతిభ కణపరిచి సత్తా చాటుకుంది. టెన్నిస్‌లో వివిధ విభాగాలైన జె-30, జె-60, జె-100, పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచి దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఇటివల పుణెలో జరిగిన టోర్నమెంట్‌లో డబుల్స్‌లో రన్నర్‌గా, సింగిల్స్‌లో విన్నర్‌గా నిలిచింది. గత సంవత్సరం బెంగుళూరులో నిర్వహించిన ప్రపంచ స్థాయి టోర్నమెంట్లో (జె-30)లో సింగిల్స్, డబుల్స్‌లో విజేతగా నిలిచింది. ఇటివల చండీఘర్‌లో జరిగిన టోర్నమెంట్‌లో డబుల్స్‌లో రన్నర్‌గా, జె-200లో అర్హత సాధించింది.

నేడు కలకత్తాతో ఢీ..



ప్రపంచ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ పోటీల్లో సోమవారం కలకత్తాలో జె-200మ్యాచ్‌లో పాల్గొననుంది. అదేవిధంగా ఈ నెల 27న చెన్నైలో ఎస్.డి.ఏ.టి లో జరిగే 'ఖేలో ఇండియా' టోర్నమెంట్‌లో పాల్గొన్నానుంది.

'ప్రతిభకు ప్రోత్సాహకమివ్వాలి..'

నేటి పోటీ ప్రపంచంలో పేదింట నుంచి ఉత్తమ ప్రతిభతో గొప్పగా రాణిస్తున్న విద్యార్థులు, యువతకు ప్రోత్సాహకాలు అందించి ప్రోత్సహిస్తే మరింత మంది ఉన్నత స్థాయికి చేరే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. పలు కార్పొరేట్ కంపెనీలు కేటాయించే సీఎస్ఆర్ ఫండ్స్‌ను ఇటువంటి వారికి కేటాయించి చేదోడుగా నిలిస్తే దేశ ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెటతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఇరువారం అభివృద్ధికి ఆర్థికసాయం అందిస్తున్న ఐఓసిఎల్ ప్రతినిధులు.

20వ డివిజన్ అభివృద్ధికి ఐఓసి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక ఇరువారం స్లమ్ ఏరియాలో కమ్యూనిటి హాలు, డ్రైనేజి వ్యవస్థ అధ్వానంగా ఉందని 20వ వార్డు కార్పొరేటర్ కే.అశోక్ ఐఓసి సౌత్ ఇండియన్ డైరెక్టర్ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలేష్ తివారీ కి వినతి పత్రం అందించారు. చిత్తూరు నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ క్వార్టర్స్ లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐఓసి సౌత్ ఇండియన్ డైరెక్టర్ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలేష్ తివారీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ ఇరువారంలోరి ప్రజలు డ్రైనేజి పైపులైను, కమ్యూనిటి హాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో స్పందించిన సౌత్ ఇండియన్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలేష్ తివారీ సానుకూలంగా స్పందించి ఈసిఎల్ ఫండ్స్ వినియోగం పై ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని చిత్తూరు నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. ఇంత సహాయ సహకారాలు అందిస్తున్న ఐఓసిల్ వారికి వార్డు తరపున కార్పొరేటర్ అశోక్ హదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకష్ణ, పారస్ట్ డిఎఫ్ఒ, ఐఓసిల్ సీనియర్ మెనేజర్ బాలమురుగన్, ఐఓసిల్ జూనియర్ మెనేజర్ రఘువంశి ఇరువారం ప్రజలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -బంగారుపాలెం: మండలంలోని గుంతూరు గ్రామంలో గ్రామస్తుల భాష్యం వంశీ చౌదరి, భాష్యం సుదర్శన్ నాయుడు కుటుంబ సభ్యులచే హోం శక్తి భక్తులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం వంశీ చౌదరి మాట్లాడుతూ గ్రామంలోని ఓం శక్తి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమన్నారు ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తులకు ఉచిత బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : గుడిపాల మండలం నుంచి జిల్లా ట్రస్ట్ తరఫున ఏర్పాటు చేసిన 14 ఆర్‌టిసి బస్సులను నరహరిపేట చెక్ పోస్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఊపి బస్సు యాత్రను గుడిపాల మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు ప్రారంభించారు. ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్న కేశవ నాయుడు, మేల్ మరువత్తూరు యాత్రకు వెళ్లే రావాలనికి వీరందు, ఉచిత బస్సులను ఏర్పాటు చేసిన సంస్థ చైర్మన్ గురజాల జగన్ మోహన్‌కి భక్తులు,స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అనిల్,హేమాద్రి నాయుడు, చల్లా, మధుసూదన్ తోపాటు భక్తులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన యువత

ప్రజాశక్తి -రామకుప్పం: మండలం లోని మిట్టపల్లె గ్రామానికి చెందిన 30 కుటుంబాలు ఆదివారం స్థానిక జడ్పిటిసి నితిన్ ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలుకు ఆకర్షితులై వైసిపిలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ భరత్ ను కుప్పంలో గెలిపించడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు వారు పేర్కొన్నారు. టిడిపి నుంచి వైసిపిలో చేరిన వారిలో కిరణ్ కుమార్, రంజిత్, చరణ్, విజయ్ కుమార్, మురళి, రవి, బాబు, కార్తిక్, మంజునాథ్, హరి ప్రసాద్, విజయకుమార్, మునిరాజు, నవీన్ చంద్, శివకుమార్,విజయ్, తదితరులు ఉన్నారు.

ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలంలోని ఉడమలకుర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ టిడిపి నాయకుడు సురేష్ వర్మ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సమక్షంలో ఆదివారం వైఎస్ఆర్‌సిపి కండువా కప్పుకున్నారు .కాగా ఉడమలకుర్తి, వెంకటాపురం, చిలమకులపల్లి పంచాయతీలతోపాటు మండలంలో పలు పంచాయతీలలో పట్టున్న సురేష్ వర్మ టిడిపి నుంచి వైఎస్ఆర్సిపి రావడంతో మంత్రులు వైఎస్ఆర్సిపి నాయకులలో ఉత్సాహం రేకెత్తించింది ఈ సందర్భంగా మంత్రి స్వాగతం పలికారు.

మంత్రిని కలిసిన కోడి విద్యాసాగర్

ప్రజాశక్తి -బంగారుపాలెం : మండలంలోని సంక్రాంతి పల్లి గ్రామానికి చెందిన గిరి ఆక్వా, సాగస్ బిస్కెట్, సాగస్ కాఫీ ఎక్స్‌ప్రెస్ అధినేత కోడి విద్యాసాగర్ రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త పనిచేసేలా కలుపుకొని వైసిపి విజయానికి పనిచేయాలని కోరారు.

గెలుపునకు ఐక్యంగా పని చేయాలి: టిడిపి

ప్రజాశక్తి - రామకుప్పం: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, గ్రామ సాధికార సభ్యులు కుప్పం నియోజకవర్గం లో చంద్రబాబు గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ 'నా బూత్- నా బాధ్యత కార్యక్రమం' పై అవగాహన కల్పించారు. బూత్ కు సంబంధించిన ఓటర్ వెరిఫికేషన్ అందరూ కలిసి నమోదు చేసుకోవాలన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని బూత్ కన్వీనర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గత టిడిపి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో విసిగిపోతున్న ప్రజలకు మనోధైర్యాన్ని ఇచ్చి రానున్నది టిడిపి ప్రజా పాలన ప్రభుత్వమేనని భరోసా కల్పించండి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్రా నారాయణ, ప్రధాన కార్యదర్శి నరసింహులు, చలపతి, రఫీ, విశ్వనాథ్, వెంకటాచలం, సీతాపతి ,గంట్లప్ప గౌడు, రామ్మూర్తి, గజేంద్ర, వెంకటరమణ, మునిరెడ్డి, మనోహర్, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, నందా రెడ్డి, జయశంకర్ పాల్గొన్నారు.

టిడిపి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని ననియాల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నీలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం టిడిపి నేతలు కార్యకర్తలు ఆమె భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఆదేశాల మేరకు వారి కుటుంబానికి తక్షణ సాయంగా పదివేల రూపాయలను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మున స్వామి నేతలు రామ్మూర్తి, గజేంద్ర, మనోహర్, కామరాజు నాయక్, వేణు నాయుడు, వెంకటేష్ ,గంగాధర్, దశరధప్ప పాల్గొన్నారు.



ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -చౌడేపల్లి : జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జయ వారాహి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్' డైరెక్టర్ డాక్టర్ . గుండ్లూరు సురేంద్ర బాబు స్విమ్స్ ఆసుపత్రి తిరుపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజమణి సహకారంతో 'నరేన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో పందిళ్ళపల్లి పంచాయతీ బాల సముద్రం గ్రామం నందు "ఉచిత మెగా వైద్య శిబిరం" నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది . ఈ కార్యక్రమానికి యం. వెంకట్రమణ రాజు యం చంద్రవదన యం. ప్రదీప్ రాజు విజయలక్ష్మి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 500 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరేన్ ఫౌండేషన్ అధ్యక్షులు జి. తులసీరామ్, కోశాధికారి నరేష్ బాబు, కార్యదర్శి ఎ. సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు రవీంద్రబాబు, జాయింట్ సెక్రటరీ మోహన్ కుమార్, మణి, బాల సుబ్రమణ్యం, భాను ప్రకాష్, దేవేంద్ర, డా. పవన్, రంజిత్, నాగేంద్ర, గణేష్, పీతాంబరం, సుధాకర్, వైద్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా కెర్లేపల్లి బాలసుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో సంఘ అధ్యక్షునిగా పట్టణానికి చెందిన కె.బాలసుబ్రమణ్యం మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, పట్టణ ప్రజలు ప్రముఖ సంస్థల లయన్స్ క్లబ్ , వాసవి క్లబ్ , వనితా క్లబ్, అనుబంధ సంఘాల సభ్యులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దొరకని దొంగలు..

- గుడి హుండీలనూ వదలని వైనం
- కేసులను ఛేదించని పోలీసులు




దొంగలు నగదు అపహరించిన వాసు హార్డ్వేర్ షాపు ఇదే..

మండలంలో రోజురోజుకీ దొంగతనాలు పెరిగిపోతున్నాయి. చివరికి గుడిలో ఉన్న హుండీలనూ దొంగలు వదలడం లేదు. దొంగల ఆగడాలు పోలీసులకు పెను సవాలుగా మారుతోంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా అపహరణకు గురైన నగదును రికవరీ చేయడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకిలా జరుగుతుందో అర్థం కావడం లేదని ప్రశ్నిస్తున్నారు. రైతుల పొలంలో బావుల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ వైర్లను దొంగతనం చేసి తీసుకెళుతున్నారు. అయినా పోలీసులు స్పందించి వీరిపై దృష్టి పెట్టక పోవడంపై బాధితులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో పచ్చికాపల్లం ,వెదురు కుప్పం, పాతగుంట, మొరవ, దేవలంపేట ప్రధాన వాణిజ్య కూడలిగా ఉన్నాయి. ఈ ప్రాంతాలను దొంగలు ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. 2021 , అక్టోబర్‌లో పచ్చికాపల్లంలో వాసు హార్డ్వేర్ షాపులో దొంగలు అపహరించారు. రాత్రి సమయంలో దొంగ షాపులోకి ప్రవేశించి కౌంటర్లో ఉన్న నగదును పట్టుకెళ్లాడు. నెలలో రెండు పర్యాయాలు అదే షాపులో అదే తీరులో దొంగతనం చోటుచేసుకుంది. బాధితుడు స్థానికుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత సంవత్సరం డిసెంబర్‌లో పచ్చికాపల్లంలో ఓ జ్యువెలరీ షాపులో షట్టర్‌ను తీసేందుకు దొంగ నానా ప్రయత్నాలు చేశాడు. అయినా తెరుచుకోలేదు. సంబంధిత విషయమై పోలీసులకు ఫిర్యాదు అందింది. గత వారం తిరుమలయ్య పల్లి పంచాయతీలో ఓ దేవాలయంలో హుండీ పగలగొట్టి అందులో ఉన్న నగదును పట్టుకెళ్లారు. గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఒక్క కేసునూ ఛేదించలేదని బాధితులు తెలిపారు. దొంగతనాలపై ఎందుకు దృష్టి సారించడం లేదో తమకు అర్థం కావడం లేదని స్థానికులతో పాటు బాధితులు వాపోతున్నారు. ఇకనైనా పోలీస్ అధికారులు దొంగలను పట్టుకుని తమ భయాందోళనను తొలగించాలని బాధితులు కోరుతున్నారు.

రెండు వారాల్లో పట్టుకుంటాం..



దొంగలను పట్టుకునే పనిలోనే వున్నాం.. పై స్థాయి అధికారుల ఆదేశాల మేరకు, రెండు వారాల్లో పచ్చికాపల్లంలో దొంగ తనాలకు పాల్పడిన దొంగలను పట్టుకుంటాం. సెల్ ఫోన్ నెంబర్లను ట్రేస్ అవుట్ చేస్తున్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..

- రమేష్ బాబు, వెదురుకుప్పం ఎస్ఐ

విద్యా వనరుల కేంద్రానికి బీరువా వితరణ



బీరువా వితరణ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి యుటిఎఫ్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యాశాఖ, విద్యా వనరుల కేంద్రంకు ఆదివారం బీరువా వితరణ చేశారు. మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణమ్మ, ఎంఈఓ 2 ప్రసాద్ సమక్షంలో మండల వనరుల కేంద్రంకు 12 వేల రూపాయలు విలువ చేసే బీరువాని ఉపాధ్యాయుల సేవా పుస్తకాల అవసరాలకు అనుగుణంగా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు వై ఆర్ కృష్ణయ్య , గౌరవ అధ్యక్షులు ఎం ఎస్ శేఖర్ , జిల్లా సహాధ్యక్షులు రెహనా బేగం , జిల్లా కార్యదర్శి పంటపల్లి సురేష్, మండల అధ్యక్షులు పార్థసారథి , మండల ప్రధాన కార్యదర్శి సర్దార్ , కోశాధికారి గిరి బాబు , జిల్లా కౌన్సిలర్ ఎం సురేష్ కుమార్ మహిళా కన్వీనర్ లతా రాసి ,మహిళా సభ్యులు జ్యోతి ప్రిస్కిల , మండల ఆడిట్ సభ్యులు వాసు దేవ మండడి , మండల కార్యదర్శి మూర్తి ,అకాడమిక్ సభ్యులు తులసి మునయ్య , సిపిఎస్ కన్వీనర్ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు హరికృష్ణ ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి: సిఐ



సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -వి కోట : ప్రతి ఒక్క వాహన దారుడు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు అరికట్టేందుకు కృషి చేయాలని వీకోట అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. మండలంలో రోడ్డు ప్రమాదాలు అరికట్టే లక్ష్యంతో యాక్సిడెంట్ జోన్ల పరిధిలో పోలీసులు సూచిక, హెచ్చరిక బోర్డులను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అత్యంత ప్రమాదకర ఆక్సిడెంట్ జోన్లను గుర్తించి వాహన సోదరులు అప్రమత్తం చేసేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు అతివేగం ప్రమాదకరమని గుర్తించాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్లతో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని హెచ్చరించారు. వాహనాలు నడిపే వ్యక్తులు తమకు ఓ కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తించుకుని ముందుకెళ్లాలన్నారు. మండల పరిధిలోని కుప్పం వైపు వెళ్లే వాహనాలకు దాసర్లపల్లి రోడ్డులో రెండు, ఫ్యార్ నంబర్ రోడ్డు లో పాపేపల్లి మిట్ట వద్ద మూడు, పలమనేరు రహదారిలో ని కొమ్మరమడుగు వరకు నాలుగు బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మనోహర్, ఏఎస్ఐ జయకృష్ణ ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టివో కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నగరి: నగరిలో ఆర్‌టివో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావాలని, నగరి ఆటో టాక్స్ యూనియన్ నాయకులు బాష, యేసు, శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం టాక్సీ ఆటో డ్రైవర్లు నగరిలో ఆర్‌టివో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వెలన్ అధ్యక్షతన నగరిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ జిల్లా విభజన తరువాత పుత్తూరులో అందుబాటులో ఉన్న ఆర్‌టివో కార్యాలయాన్ని తొలగించి చిత్తూరుకు మార్చారన్నారు. ఆటో కార్మికుల ఎఫ్‌సి చేయాలన్నా ఒక రోజులో పూర్తి కావడం లేదని, రెండు రోజులు టైం పడుతోందని, దీనివల్ల విపరీతమైన ఖర్చులు పెరిగి ఇబ్బందికరంగా మారుతోదన్నారు. నగరిలో వెంటనే ఆర్‌టివో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో దీనిపై ఆర్డీఓకి, స్థానిక ఎమ్మెల్యే మంత్రి ఆర్కే రోజాకు వినతి పత్రం ఇచ్చామన్నారు. అయినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేలన్, విజయ్ కుమార్, రూప కుమార్, ఆటో టాక్సీ యూనియన్ నాయకులు బాష, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం



మాజీ మంత్రి అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -నగరి: తమను గెలిపిస్తే నగరిని అభివృద్ధి చేస్తానని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ప్రజలను కోరారు. నగరి మున్సిపాల్టీలోని 4,5 వ వార్డుల్లో నిర్వహించిన 'మీ కోసం మీ తెలుగుదేశం', 'బాబు ష్యూరిటీ – భవిష్యత్‌కు గ్యారంటీ'లో పాల్గొని ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టో పథకాలు వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నగరిలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. టిడిపి వస్తే అమలు చేసే కార్యక్రమాలన వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రసిడెంట్ రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, గుణశేఖర్, ఎన్ శ్రీనివాసులు, జి అయ్యప్ప, జె రత్నకుమార్, పద్మనాభన్, శ్రీధర్, సలీం, శేఖర్, పవన్, విజయ్ కుమార్, ఖాదర్ బాయ్, వికెఎస్ వాసు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి : మండలంలోని లక్కనపల్లి పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి, గడ్డిండ్లు, పెద్దపురం, చిన్నపురం,తొరిడి, రామనపల్లి, లక్కనపల్లి లలో ఇంటింటికి టిడిపి, బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. లక్కనపల్లిలో భారీ గజమాలతో ఆయనను సత్కరించడంతో పాటు పూల వర్షంతో ముంచెత్తారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన వైసిపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిషోర్ గౌడ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రఘు చంద్రగుప్త, నాయకులు దివాకర్ రెడ్డి, భువన చంద్ర గౌడ్, అరుణ్, శ్రీనివాసు మూర్తి, పలని, అమర్నాథ్ రెడ్డి, మహిళా విభాగం నాయకురాళ్లు శివకుమారి, జయమ్మ, ధనలక్ష్మి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

ఏపీ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - పలమనేరు: ఏపీ గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రెటరీస్ (ఏఎన్ఎమ్స్) కు పనిభారం తగ్గించి, ఆన్ లైన్ యాపులు తగ్గించాలని ఏపీ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి, ఉప ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. ఆదివారం పలమనేరు సంత, బజారు ,ఉర్దూ పాఠశాలలో సచివాలయ ఏఎన్ఎమ్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసి అనేక వేలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయాల్లో ఇతర శాఖల ఉద్యోగుల కన్నా ఏఎన్ఎమ్స్ కు రోజుకు మూడుసార్లు బయోమెట్రిక్ వేయాలంటే మహిళా ఏఎన్ఎమ్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.బయోమెట్రిక్ మినహాయింపు ఇవ్వాలని కోరారు.సాధారణ బదిలీలు అవకాశం కల్పించాలని కోరారు.యూనిఫాం అలవెన్సులు, గ్రేడ్ –3 నుంచి హెల్త్ అసిస్టెంట్ లుగా ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు . సచివాలయం ఏఎన్ఎమ్స్ సంబంధం లేని పనులు చేయించరాదని కోరారు.లీవుల సౌకర్యం కల్పించాలని కోరారు.అర్బన్, , రూరల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎమ్స్ కు కిట్ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. నెలలో రెండవ శనివారం లీవు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎమ్స్ అముధ,సుజాత, ఇంద్రాణి, మాధవి, రెడ్డమ్మ, భారతి, మంగమ్మ, సుగుణ పాల్గొన్నారు

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మ గారి పల్లి గ్రామంలో గత 15 రోజులుగా తాగునీటి సమస్య నెలకొనడంతో స్పందించిన సర్పంచ్ వనజమ్మ నూతన బోరు మోటారు, పంపు సెట్టు కొనుగోలు చేసి ఆదివారం బోరులో దించి నీటిని గ్రామంలోకి సరఫరా చేశారు. నాయకులు రమణారెడ్డి మాట్లాడుతూ 15 రోజులుగా గ్రామంలో ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే బోరు మోటారు కాలిపోవడం మళ్లీ రెడీ చేసి బిగించిన తిరిగి కాలిపోవడం జరుగుతూ ఉండడంతో నూతన బోరు మోటారు పంపుసెట్టు తెచ్చి బిగించారని దీనివల్ల గ్రామంలోని 150 కుటుంబాలకు తాగునీటి సమస్య పరిష్కారం అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లలిత కుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రప్రకాష్

జనసేన, టీడీపీలో భారీ చేరికలు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లె గ్రామం జనసేనలో 100 మందికి పైగా యువకులు, టిడిపిలో 100 మందికి పైగా యువకులు భారీ సంఖ్యలో జనసేన, టీడీపీ నాయకత్వం పై నమ్మకంతో ఇరు పార్టీల నాయకుల సమక్షం లో ఆదివారం చేరారు. ఈ కార్యక్రమానికి జనసేన తిరుపతి ఇంఛార్జ్ కిరణ్ రాయల్ , రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, చిత్తూరు ఆరణి కవిత , రాష్ట్ర కార్యక్రమ నిర్వహణ కార్యదర్శి ఎ. కె శరవణ , చిత్తూరు జనసేన నాయకులు శ్రీ రామ్ లోచన్, ధీరజ్ దుద్ధి, చిత్తూరు జనసేనశ్రేణులు, టీడీపీ నుండి టీడీపీ నాయకులు దొరబాబు , చంద్రప్రకాష్ , శశిధర్ బాబు, జనసేన, టీడీపీ శ్రేణులు హాజరయ్యారు.ఈ కార్యక్రమ నిర్వాహకులు జనసేన నుండి నవీన్ , తెలుగుదేశం నుండి రాజు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, వచ్చే ఎన్నికల్లో ఘన విజయానికి మరింతగా కృషిచేయాలని వారు పేర్కొన్నారు.

'జగనన్నతో జనం...భరతన్నతో మనం..!'

ప్రజాశక్తి -రామకుప్పం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా పేర్కొన్నారు. ఆదివారం ముద్దనపల్లి గ్రామంలో 'జగనన్న తో జనం.. భరతన్న తో మనం' కార్యక్రమం లో భాగంగా మహిళలకు పసుపు, కుంకుమ సారె అందించి కుప్పం నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ ను గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే భరత్ గెలుపుతో సాధ్యమవుతుందన్నారు. సిసి రోడ్లు ,పారిశుధ్యం, డ్రైనేజీలు, వీధి దీపాలు త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ సికిందర్, ఎంపీటీసీ మంజునాథ్, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు బోర్వెల్ చంగారెడ్డి, లోకేష్,అశోక్ ,కుమార్ ,సుధాకర్, గంగాధరం పాల్గొన్నారు.

క్రైం న్యూస్

నాటు సారా ఊట ధ్వంసం

15 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం తమ్మి నాయుని పల్లి పంచాయతీ పేగల వారి పల్లి అటవీ ప్రాంతంలో నాటు సారా కాచుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై వెంకట నరసింహులు తన సిబ్బందితో వెళ్లి అటవీ ప్రాంతంలో గాలించి 500 లీటర్ల నాటు సారా ఊటను గుర్తించి దానిని ధ్వంసం చేసి అక్కడే సిద్ధంగా ఉన్న 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నాటు సారా తయారీ అమ్మకం చట్టరీత్యా నేరమని ఎవరైనా నాటు సారా తయారు చేస్తున్నట్లు ప్రజలు గుర్తిస్తే వారి సమాచారాన్ని పోలీసులకు తెలపాలని వారి వివరాలను గోప్యంగా వుంచుతామని ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

మీ బిడ్డగా ఆదరించండి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -శాంతిపురం: 'మీ సమస్యను తీర్చడానికి గడపగడపకు నియోజకవర్గమంతా తిరిగానని మీ బిడ్డగా నన్ను ఆదరించి రానున్న ఎన్నికల్లో శాసనసభ సభ్యుడుగా నన్ను గెలిపించాలని ఎమ్మెల్సీ కె ఆర్ జె భరత్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని కడపల్లి లో జరిగిన "వన్నియకుల క్షత్రియ ఆత్మీయ" సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కుప్పం నియోజకవర్గంలో 72 శాతం సామాజిక వర్గం ఉన్న వన్నియకుల క్షత్రియులకు రాజ్యాధికారాన్ని అందివ్వడమే ధ్యేయంగా దివంగత నేత మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కే చంద్రమౌళి తనయుడిగా మీ ముందుకు వచ్చానని అన్నారు. కుప్పం నియోజకవర్గంలో తమ సామాజిక వర్గం ఈసారి శాసనసభ్యులుగా గెలవాలని ఆకాంక్షను రగిలించిన వ్యక్తి డాక్టర్ కె చంద్రమౌళి అని ఆయన ఆశయ సాధన కోసం తాము అహర్నిశలు కుప్పం నియోజకవర్గంలో ప్రజా సేవలో నిమగ్నమయ్యా మన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా భరత్, రాష్ట్ర వన్నికుల క్షత్రియ ఛైర్మన్ వనిత శ్రీను, శాంతిపురం మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి,కుప్పం మండల కన్వీనర్ హెచ్ ఎం మురుగేష్,గుడిపల్లి మండల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కో కన్వీనర్ రామ్మూర్తి,మండల వన్నియకుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలను ఘనంగా ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయులు రంగారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ బ్యాట్ చేతబట్టి బ్యాటింగ్ చేసి పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ నంజంపేట ఉన్నత పాఠశాల నందు గత కొన్ని సంవత్సరాలుగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలలో భాగంగా క్రికెట్ పోటీలను నిర్వహించడం జరుగుతోందని ఇదే క్రమంలో పాఠశాల స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా క్రికెట్ పోటీలను నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ తమ వంతు సాయంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పాఠశాలకు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తూ ఉండడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రజలను మోసగించడానికే బాబు మేనిఫెస్టో

- కుల మతాలు చూడకుండా అభివృద్ధి చేశాం- విగ్రహావిష్కరణ సభలో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి -పుంగనూరు : టిడిపి అధినేత చంద్రబాబు మేనిఫెస్టో ప్రజలు మోసం చేయడం తప్పితే అభివృద్ధి లేదని అదే వైయస్సార్ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేసి చేతుల రూపంలో చూపించమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణానికి సమీపంలోని బైపాస్ రోడ్డు భీమ గాని పల్లి సర్కిల్లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా రాష్ట్రంలో పర్యటించిన జగన్ హన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలుపరిచిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలు దోచుకు తిన్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కుల మతాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందించమన్నారు. కరోనా కష్టాలతో రాష్ట్రం రెండు సంవత్సరాలు ఆర్థిక ఇబ్బందులు పడిన మొక్కవోని దీక్షతో సంక్షేమ క్యాలెండర్ లో పేర్కొన్న పథకాలన్నీ లబ్ధిదారులకు బటన్ నొక్కి ఖాతాల్లోకి జమ చేశారన్నారు. రాష్ట్రంలో కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి కాపులకు అధిక ప్రాధాన్యత కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్ఆర్సిపి నే అని చెప్పారు. అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ ఎన్ రెడ్డప్ప ,ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆరని శ్రీనివాసులు ,రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు, శ్రీకాళహస్తి ఆలయచైర్మన్ అంజూరు శ్రీనివాసులు, తిరుపతి జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి ,మాజీ తిరుపతి తిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు పోకల అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధి జగనన్న తోనే సాధ్యం

డిప్యూటీ సిఎం నారాయణస్వామి



పింఛన్లు అందిస్తున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : పేద వాళ్లకోసం తపన పడి,వారి అభివృద్ధి చేయాలన్న ఆలోచించే వ్యక్తి జగన్మోహన్ రెడ్డి ఒక్కరేనని , 2019 నుండి ఎస్.ఆర్.పురం మండలంలో 6,534 మందికి వివిధ రకాల పెన్షన్లు అంద జేయడం తో పాటుగా మహిళ సంఘాలకు వడ్డీ రుణమాఫీ,రైతు భరోసా ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కి దక్కుతుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం కె. నారాయణ స్వామి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ ఆర్ పురం మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యా లయం ఆవరణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేసి పండుగ వాతావరణం లో రూ.2750 నుండి రూ.3 వేలకు పెంచిన వైఎస్ఆర్ పెన్షన్లు లబ్ధిదారు లకు డిప్యూటీ సీఎం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆకలితో ఉన్న వారిని, చదువురాని వారిని ఆర్థికంగా సామాజికంగా వారికి న్యాయం చేయా లన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో. స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య, తశీల్దార్ బెన్ను రాజ్, యం. పి.డి.ఓ, కృష్ణ య్య , యం పి పి, సరిత జడ్పీటిసి టి.రమణ ప్రసాద్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, మాజీ జెడ్పిటిసి గురువారెడ్డి, మండల కన్వీనర్ మణి, మాజీ మండల కన్వీనర్ అనంతరెడ్డి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కుప్పయ్య, జనార్ధన్ ప్రజా ప్రతినిధులు, కొత్త పెన్షన్లు మంజూరైన లబ్దిదారులు మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.